టీహబ్‌ను సందర్శించిన ఫుజిట్స్ బృందం


ఫుజిట్స్ లీడర్‌షిప్ బృందంతో టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ను ఫుజిట్స్ లీడర్‌షిప్ బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా టీహబ్ సీఈఓ ఎం శ్రీనివాసరావుతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆవిష్కరణ ఎకోసిస్టమ్ ప్రాధాన్యతను టీహబ్ ప్రతినిధులతో ఈ బృందం చర్చించింది. ఫుజిట్స్ బృందం మ్యాథ్ఎంఎల్, ఏఐ టెక్నాలజీ హబ్ స్టార్టప్‌లతో మాట్లాడి పలు అంశాలను తెలుసుకున్నారు. వారు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలు, పరిష్కారాలకు సంబందించిన సమాచారాన్ని పంచుకున్నారు. ఫూజిట్స్ అనేది ఒక ప్రముఖ జపనీస్ ఐసీటీ కార్పొరేషన్, ఇది టీ హబ్‌తో భవిష్యత్తులో కలిసి పనిచేయడానికి తమ ఆసక్తిని వ్యక్తం చేసింది.

లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ తనిఖీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న అంతర్జాతీయ ప్రతినిధులు

చందానగర్ : చందానగర్ హుడా కాలనీలోని లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్‌ను గురువారం యుబీఎస్ కార్పొరేట్ అంతర్జాతీయ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా లైట్‌హౌస్ మేనేజర్ శ్రీనివాస్ ఆకుల మాట్లాడుతూ యుబీఎస్ సంస్థ డైరెక్టర్లు మాథియస్ షాకే , జ్యోతి బతుల, జీవన్ దాల్వీలతో పాటు 20 మంది సభ్యులు లైట్‌హౌస్‌ను పరిశీలించినట్లు తెలిపారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఆర్థికంగా ఎదగడానికి లక్ష్యాలపై అవగాహన కల్పించారన్నారు. లైట్‌హౌస్ ఫౌండేషన్‌లో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్యూటీసియన్, టైలరింగ్ శిక్షణ తరగతులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

చెత్తను ఆటో కార్మికులకు అందజేయాలి


వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలని బాలాజీ నగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లో నాలా శుభ్రం చేసే పనులను డీసీ రమేష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలాలో వ్యర్థాలు, పేరుకుపోయిన మట్టిని తొలగించినట్లు తెలిపారు. నాలా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రతి ఒక్కరూ నాలాలో చెత్త వేయకుండా తమ వంతు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రభాకర్, సీఓ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, రాంకీ సంస్థ మేనేజర్ హరికృష్ణ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏలు, ఆర్పీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ సబిహా బేగం సున్నం చెరువు జీవీపీ ఎలిమినేషన్ పాయింట్‌ను జీహెచ్ఎంసీ ఎంటమాలజీ, ఆర్పీలతో శుభ్రం చేయించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్లల్లోని చెత్తా చెదారాన్ని జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోలో వేయాలని, బయట, రోడ్డుపై వేస్తే దుర్గంధం, దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. అదే విధంగా సున్నం చెరువులో గుర్రపుడెక్కను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని, గుర్రపుడెక్క తొలగిస్తేనే దోమల బెడద తగ్గుతుందని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడలోని వార్డు కార్యాలయం పరిసర ప్రాంతాల్లో నాలాలు, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజైన శుక్రవారం వన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆల్విన్‌కాలనీ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వివేకానందనగర్ డివిజన్‌లోని రిక్షా పుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్‌లో సంబంధిత అధికారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గురువారం పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి నిల్వ ఉన్న ట్యాంకులు, పాత్రలపై మూత పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వాయిద్ అలీ, ఇంజినీరింగ్ ఏఈ ఆశ, శానిటేషన్ జవాన్ కుమార్, యూబీడీ దివ్య, ఎంటమాలజీ సిబ్బంది, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు లింగయ్య, మధు, మాచర్ల భద్రయ్య, కృష్ణ, ప్రవీణ్, కిరణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కూకట్‌పల్లి: రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీస్ అధికారుల దాడులను నిరసిస్తూ కూకట్‌పల్లి న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీస్ అధికారుల దుశ్చర్యలు కొనసాగుతున్నాయన్నారు. సంగారెడ్డి సంఘటన మరువకముందే జనగామ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి దురహంకారంతో అక్కడి న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై అమానుషంగా దాడి చేసి, అసభ్య పదజాలంతో అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కూడా విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులపై దాడి చేసిన జనగామ సీఐ, ఇతర పోలీస్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థకు మోక్షం

రాయదుర్గం: చాలా రోజులుగా డ్రైనేజీ వ్యవస్థతో నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంతో కొంత ఊపిరి పీల్చుకోవడానికి ఆస్కారం కల్పిస్తోంది. గచ్చిబౌలి డివిజన్ లోని గోపన్‌పల్లిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం గురువారం ప్రారంభించారు. అందులో భాగంగా మురుగు కాలువలు, నాలాలు, వరద నీటి కాలువలలో పేరుకపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి ఆదేశంపై శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, ఎస్ఏసీ సమంత పనులను పర్యవేక్షించారు. ప్రతి మురుగుకాలువ, నాలా, వరద నీటికాలువలలో చెత్తాచెదారం, వ్యర్థాలు తొలగించి వాటిని అక్కడి నుంచి తరలించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. మురుగు కాలువలు, నాలాలు, వరదనీటి కాలువల్లో చెత్తా చెదారం, వ్యర్థాలు పారబోయరాదని సూచించారు. నాలా, మురుగు కాలువలలో వ్యర్థాలు, తొలగించి మురుగు సాఫీగా పారేలా చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గోపన్‌పల్లిలోని నాలాలో శుభ్రత పనులను చేపట్టిన సిబ్బంది


మురుగునీరు సాఫీగా పారుతున్న దృశ్యం


గోపన్‌పల్లిలోని మురుగుకాలువలో రెండు రోజుల క్రితం పరిస్థితి


ప్రస్తుతం ఇలా..

డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని జయానగర్, రాఘవేంద్ర కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, పాపమ్మ బస్తీ, రాజీవ్‌గాంధీనగర్, మొగులమ్మ బస్తీ, మహాత్మా గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ, రోడ్లు, మ్యాన్ హోల్స్, శానిటేషన్ ప్రాంతాలను పరిశీలించారు. అదే విధంగా హెచ్ఎంటీ శాతవాహనపార్కు, చిల్డ్రన్స్ పార్కు, పీజేఆర్ నగర్‌లోని ముస్లిం శ్మశాన వాటికను పరిశీలించారు.

స్వచ్ఛతతోనే రోగాలు దూరం

మూసాపేట: ఆరోగ్య సంరక్షణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అన్నారు. గురువారం గూడ్స్‌షెడ్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బస్తీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ అనురాగ్, సుధాకర్, యూబీడీ శ్రావణ్, ఎస్‌ఎఫ్ఏ నాగరాజు, ఆర్పీలు, పారిశుద్ధ్య కార్మికులు, బీజేపీ నాయకులు దాకయ్య, మల్లేష్‌గౌడ్, శైలేష్, ఐలయ్య, ప్రశాంత్, కృష్ణ, రాజేందర్, శ్రీనివాస్, కిషోర్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయవృత్తి గౌరవప్రదమైనది

రాయదుర్గం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటానన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్యామల, ఏఏపీసీ చైర్మన్ వీణ, ఇన్‌చార్జీ హెచ్ఎం గాలినరహరి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మమత, సుజాత, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సరిత, భాగ్యమ్మ, కొండయ్య, శంకరాచారి, జయశ్రీ, సైయింట్ ప్రతినిధులు కృష్ణ,విద్యార్థులు,స్థానికులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గంలో నేడు వనమహోత్సవం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొంటారన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రహదారుల విస్తరణకు చర్యలు


గచ్చిబౌలి జంక్షన్‌ను పరిశీలిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, బొటానికల్ గార్డెన్, నానక్‌రాంగూడ జంక్షన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ కారిడార్‌లో వాహనదారులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. బాటిల్ నెక్ రోడ్లను గుర్తించి విస్తరణ చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న గచ్చిబౌలి జంక్షన్‌ను అందగా తీర్చిదిద్దాలని, సెంట్రల్ మీడియంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. అంజయ్యనగర్ వద్ద ప్రధాన రహదారి సమీపంలోని బండరాయిని తొలగించి రహదారిని విస్తరించాలన్నారు. బొటానికల్ గార్డెన్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేసి కొండాపూర్ వైపు ట్రాఫిక్ సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూడళ్ల అభివృద్ధి, స్ట్రీట్ ఫర్నీచర్, వాల్ పెయింటింగ్‌లను విస్తరించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జడ్సీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ శంకర్, డీసీ రజినీకాంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు గణపతి,మెహ్రా, డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎల్ఓసీలను అందజేశారు. ఫతేనగర్ డివిజన్‌కు చెందిన అజయ్‌నాయుడికి రూ.లక్ష, బాలానగర్ డివిజన్‌కు చెందిన షాహన బేగంకు రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో చికిత్స పొందడానికి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేని వారు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మేయర్‌కు ఎమ్మెల్యే గాంధీ వినతి

గచ్చిబౌలి: నియోజకవర్గ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌తో సమావేశమైన ఆయన నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. రోడ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను కలిసి లింకు రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. రోడ్ల విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఎన్‌టీయూ నుంచి ప్రగతి నగర్ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణం , అపర్ణహిల్స్ నుంచి గంగారం పెద్ద చెరువు వరకు జాతీయ రహదారికి కలిపే లింక్ రోడ్డు, హెచ్ఎంటీ స్వర్ణపురి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వరకు లింక్‌రోడ్డు, నల్లగండ్ల నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంల వరకు లింకు రోడ్డు, మియాపూర్ ప్రధాన రహదారి నుంచి విజ్ఞాన్‌స్కూల్ వరకు లింకు రోడ్డు, ఫ్లై ఓవర్, ముంబై జాతీయ రహదారి పై హోం జ్యూవెల్ నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం లింకు రోడ్డును కలిపే ఆర్ఓబీ, నాగార్జున హిల్స్ లింకు రోడ్డు పనులు, నాలాల విస్తరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా సీసీపీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.


మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో సమావేశమైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ఎన్టీఆర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్‌కాలనీలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నాలాల వ్యర్థాల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా చేయడం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే భావించవద్దని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే పచ్చదనం, స్వచ్ఛదనం కల సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిత్య ప్రక్రియగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, సామాజికవేత్తల సమష్టి కృషితోనే బస్తీలు, కాలనీలను ఆదర్శవంతంగా, సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సంజయ్, ఇంజనీర్ సోమ్‌నాథ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చిన్న మాలిక్యూల్ ఔషధాల తయారీలో సరికొత్త ట్రెండ్స్

రాయదుర్గం: చిన్న మాలిక్యూల్ ఔషధాల తయారీలో సరికొత్త ట్రెండ్స్‌పై సమగ్ర పరిశీలన జరగాలని డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్, హెచ్‌సీయూ, సైన్స్ గురూస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్-2024లో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ కెమిస్ట్రీపై జరిగిన 6వ రోజు సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాలిక్యూల్ తయారీలో వినూత్న వ్యూహాలు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. అధిక నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండటమే కాకుండా పర్యావరణపరంగా స్థిరమైన, కీలకమైన మేథో సంపత్తి హక్కులను పొందగల సామర్థ్యం ఉన్న వినూత్న తయారీ ప్రక్రియల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. కెక్యాట్ ఎంజైమాటిక్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రసాయన పరిశ్రమలో వ్యయ ప్రభావానికి, పర్యావరణ స్థిరత్వానికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్న ఎంజైమాటిక్ సింథసిస్ ప్రక్రియలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రతినిధి నల్ల కిరణ్‌కుమార్, సీడీఆర్ఐ నుంచి డాక్టర్ ఆకాంక్ష వ్యాస్, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కూరుకుపోయిన నాలా పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. గురువారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్‌లో నాలాలు, కాలువలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీవాత్సవ్, ప్రాజెక్టు ఆఫీసర్ ఇంద్రసేనా, ఏఈ రాజీవ్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ ముస్తఫా, ఆర్పీలు లత, జ్యోతి, ఎలేంద్ర, రేణుక, సుబ్బలక్ష్మి, ఎస్ఎఫ్ఏ గోపాల్, కాలనీ వాసులు మూర్తి, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణ, రాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవం

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 9:30 గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు బీబీ పాండ్ వద్ద మొక్కలు నాటనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం


కార్పొరేటర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రీన్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. గురువారం మియాపూర్ డివిజన్ పరిధిలోని నీలిమ గ్రీన్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ... కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, మంచి నీటి వసతి మెరుగుపర్చాలని, యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ...కాలనీ వాసుల సమస్యలను సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో దశల వారీగా పరిష్కరిస్తాన్నారు., కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పనులు, రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని, మంజీర మంచినీటి వసతిని మెరుగుపరుస్తామన్నారు. దశల వారీగా అన్ని పనులు పూర్తిచేసి కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తానన్నారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రీన్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

12న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్‌ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ గురువారం తెలిపారు. ఈ నెల 12 ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో అదాలత్ ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్‌ల ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

నేడు శ్రావణ మాసం పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు, సాయంత్రం 6:30 గంటలకు సామూహిక కుంకుమార్చన, ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నదానం, 27న మంగళవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాయంత్రం 6:30 గంటలకు రంగనాథుడికి తులసి దళార్చన, మంగళ శాసనములు వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.